## క్లుప్తంగా

### ఎల్‌ఓసీ అందజేత

షాద్‌నగర్: పట్టణంలోని రాంనగర్ కాలనీకి చెందిన షబానా బేగంకు సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన ఎల్‌ఓసీ పత్రాన్ని మంగళవారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. షబానా బేగం గత కొంతకాలంగా అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. వైద్యులు ఆమెకు ఆపరేషన్ చేయాలని సూచించగా.. ఆర్థిక సహాయం అందించాలని కుటుంబ సభ్యులు ఎమ్మెల్యేను కోరారు. వెంటనే స్పందించిన ఆయన సీఎం సహాయ నిధి నుంచి రూ.1.50 లక్షలు మంజూరు చేయించి ఎల్‌ఓసీ పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కొంకళ్ల చెన్నయ్య, రాజేందర్‌రెడ్డి, బస్వం, అందె మోహన్, రవికుమార్, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

### లడ్డూ @3.61 లక్షలు



వినాయకుడి లడ్డూ దక్కించుకున్న మాజీ సర్పంచ్ సంధ్యమల్లికార్జున్‌గౌడ్

షాబాద్: మండల పరిధిలోని కుర్వగూడ గ్రామంలో 13 రోజుల పాటు పూజలందుకున్న గణనాథుడి నిమజ్జనానికి సోమవారం రాత్రి యువజన సంఘం సభ్యులు భారీ ఎత్తున ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన లడ్డూ వేలం పాట పోటాపోటీగా సాగగా.. మాజీ సర్పంచ్ సంధ్యమల్లికార్జున్‌గౌడ్ రూ.3 లక్షల 61 వేలకు దక్కించుకున్నారు. వేలం పాట అనంతరం వినాయకుడి శోభాయాత్ర ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో యువజన సంఘం సభ్యులు, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

### అంత్యక్రియలకు ఆర్థికసాయం

షాబాద్: మండల పరిధిలోని బోడంపహాడ్‌కు చెందిన ఉప్పరిపల్లి గంగారాం(50) కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం మృతి చెందాడు. అతడిది నిరుపేద కుటుంబం కావడంతో భార్య అరుణమ్మకు గ్రామస్తులు, సాయిచైతన్య యువజన సంఘం నాయకులు రూ.22 వేలు అంత్యక్రియల నిమిత్తం ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో యువజన సంఘం అధ్యక్షుడు ఎండీ ఇనాయత్, సభ్యులు రఫీక్, ఆనంద్, వెంకటేశ్, మల్లేశ్, ప్రవీణ్, నర్సింలు, బాల్‌చందర్, బంటీ తదితరులు ఉన్నారు.

### బకాయిలు విడుదల చేయాలని భిక్షాటన

చేవెళ్ల: ప్రభుత్వం విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ డబ్బులను విడుదల చేయకపోవటంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కుర్వ మహిపాల్ అన్నారు. చేవెళ్లలో మంగళవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో ప్రభుత్వ తీరుకు నిరసనగా భిక్షాటన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కళాశాలల్లో చదివే విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల కాకపోవటంతో ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. వెంటనే విద్యార్థుల స్కాలర్‌షిప్ నిధులను విడుదల చేయాలని, లేని పక్షంలో ఏబీవీపీ ఆధ్వర్యంలో ఆందోళనలు, ధర్నాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు హారిక, శ్రావణి, మానస, హారిక, భరత్, శివ, ప్రణవ్, వివేకానంద, హరికృష్ణ, ప్రశాంత్, ఆకాశ్ ఉన్నారు.

### కార్మికుల సమస్యలను పరిష్కరించాలని వినతి

చేవెళ్ల: వ్యవసాయ కార్మికులు, ఉపాధి కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కోరారు. మండల కేంద్రంలోని ఆర్డీఓ కార్యాలయం ఎదుట మంగళవారం కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వారు అధికారికి వినతిపత్రం అందజేశారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని వెంటనే అమలు చేసి.. వ్యవసాయ కార్మిక కుటుంబానికి రూ.12వేలు ఇవాలన్నారు. చేవెళ్లలో సర్వే నం.75లోని పేదల గుడిసెలకు పట్టాలు అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.

### జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపిక

మొయినాబాద్: జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన 5 మంది ఉపాధ్యాయులు ఎంపికయ్యారని ఎంఈఓ మల్లయ్య తెలిపారు. అజీజ్‌నగర్ జెడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు సమీన బేగం, హిమాయత్‌నగర్ జెడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు అరుణమ్మ, చిలుకూరు జెడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు ఉమాదేవి, కేతిరెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు స్వప్న, ఎనికేపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు మల్లేశ్‌కుమార్ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారన్నారు. వారికి బుధవారం కలెక్టర్ కార్యాలయంలో జరిగే కార్యక్రమంలో అవార్డులు అందజేసి సన్మానం చేయనున్నారని వెల్లడించారు.

# జోరుగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు

- మండలంలో నిరుపేదలకు 500ల ఇళ్లు మంజూరు
- 278 బేస్‌మెంట్ వరకు పూర్తి
- మొదటి విడతలో లబ్ధిదారుల ఖాతాల్లో లక్ష రూపాయలు జమ
- మిగిలిన లబ్ధిదారులు నిర్మాణానికి అనాసక్తి

మొయినాబాద్‌రూరల్: రాష్ట్రంలో నిరుపేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిమ్మ ఇళ్ల పథకాన్ని ప్రారంభించింది. దీంట్లో భాగంగా అర్హులైన లబ్ధిదారులను గుర్తించేందుకు ప్రజాపాలనలో దరఖాస్తులను స్వీకరించింది. ఆయా దరఖాస్తులను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి అర్హులైన లబ్ధిదారులను గుర్తించారు. ప్రస్తుతం గ్రామాల్లో లబ్ధిదారులు చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు జోరుగా సాగుతున్నాయి. మండలంలో మొదటి విడతలో 500ల మంది నిరుపేదలను ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు ఎంపిక చేశారు. మొత్తం 19 గ్రామ పంచాయతీల్లో అర్హులైన లబ్ధిదారులను అధికారులు ఎంపిక చేసి నివేదికతో వారందరికీ ప్రొసీడింగ్ ఆర్డర్లు అందజేశారు. కానీ 278 మంది లబ్ధిదారులు మాత్రమే ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. మిగిలిన 202 మంది లబ్ధిదారులు ఆసక్తి చూపకపోవడంతో రిజెక్ట్ చేశారు. అధికారులు రిజెక్ట్ అయిన లబ్ధిదారులను ఆచరణలోకి తీసుకొని.. కొత్తగా 176 మంది లబ్ధిదారులను ప్రపోజల్ చేసి ప్రభుత్వానికి నివేదిక పంపించారు. పస్తుతం 278 మందిలో బేస్‌మెంట్ వరకు ఇళ్లు పూర్తయిన లబ్ధిదారుల్లో 2, 3 మందికి తప్పా అందరికీ మొదటి విడత లక్ష రూపాయలు వారి వారి ఖాతాల్లో జమ అయ్యాయి.



అమ్డాపూర్‌లో కొనసాగుతున్న ఇంటి నిర్మాణ పనులు

**ఒకరిద్దరు మినహా.**

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇందిరమ్మ ఇళ్ల మంజూరు కోసం లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు ప్రజాపాలనలో దరఖాస్తులను స్వీకరించారు. అధికారులు దరఖాస్తులకు పరిశీలించి మండలంలో 500ల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశారు. అందులో 278 మంది లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలకు ముందుకొచ్చారు. దీంతో అధికారులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం ముగ్గులు పోసి పనులు ప్రారంభించారు. ప్రస్తుతం ఆయా గ్రామాల్లో ఇళ్ల నిర్మాణాలు బేస్‌మెంట్ వరకు పూర్తయ్యాయి. వారిలో దాదాపు 275 మందికి మొదటి విడత బిల్లులు మంజూరయ్యాయి. పలు గ్రామాల్లో ఇల్లు మంజూరైనా కొంతమంది పలు కారణాలతో ఇళ్ల నిర్మాణాలకు ముందుకు రాలేదు. వారి ప్రొసీడింగ్‌లను అధికారులు రిజెక్ట్ చేశారు.



కేతిరెడ్డిపల్లిలో బేస్‌మెంట్ లెవల్ పూర్తయిన ఇల్లు

### సొంతింటి కల సాకారం



రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ద్వారానే పేదల సొంతింటి కల సాకరం అవుతుంది. మండలంలో 500ల మందిని అధికారులు ఇందిరమ్మ ఇళ్లకు అర్హులుగా గుర్తించారు. గ్రామాల్లో ఇళ్ల నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. లబ్ధిదారులందరూ నాణ్యతతో నిర్మించుకొని సొంతింటి కళను సాకారం చేసుకోవాలి. ప్రభుత్వం విడతల వారీగా ఐదు లక్షల రూపాయలను ఖాతాల్లో జమచేస్తుందన్నారు.

– మర్రి రవీందర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు

### మొదటి విడత బిల్లులు మంజూరు



మండలంలో ఇందిరమ్మ ఇళ్ల బేస్‌మెంట్ వరకు నిర్మించుకున్న వారికి మొదటి విడత లక్ష రూపాయలు వారి వారి ఖాతాల్లో జమ చేశాం. మండలంలో 278 మందిలో ఒకరిద్దరికీ బయోమెట్రిక్, ఆధార్ కార్డు లింక్ సరిగా లేకపోవడంతో బిల్లులు ఆగిపోయాయి. ఇళ్ల నిర్మాణానికి నాలుగు విడతలుగా ప్రభుత్వం ఐదు లక్షలు మంజూరు చేస్తుంది. లబ్ధిదారులు దీనిని దృష్టిలో పెట్టుకొని ఇళ్లను నిర్మించుకోవాలి.

– సంధ్య, ఎంపీడీఓ

# ఐక్యతతోనే సమస్యల పరిష్కారం

**భారతీయ కిసాన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గజేందర్‌గౌడ్**

షాబాద్: రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారం కావాలంటే.. ఐకమత్యమే ఆయుధం, పోరాటమే మార్గమని భారతీయ కిసాన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గడిగె గజేందర్‌గౌడ్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని చర్లగూడలో బలరామ జయంతి సందర్భంగా రైతు దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వాలు ప్రజాసమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమవుతున్నాయని ఆరోపించారు. భారతీయ కిసాన్ సంఘ్ గత 50 సంవత్సరాలుగా రైతులను పార్టీకతీతంగా ఒకే వేదిక మీదికి తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నట్లు పేర్కొన్నారు. దేశంలోనే అతి ఎక్కువ సభ్యులు గల రైతు సంఘంగా నేడు భారతీయ కిసాన్ సంఘ్ అవతరించినట్లు తెలిపారు. గ్రామాల్లో రైతులు ప్రధానంగా విద్యుత్, రెవెన్యూ, మార్కెటింగ్ సమస్యలను ఎదుర్కొంటున్నారన్నారు. విద్యుత్ శాఖ అధికారులతో సమన్వయం చేసుకొని అనేక కరెంట్ సమస్యలను పరిష్కరించినట్లు స్పష్టం చేశారు. మార్కెటింగ్ సమస్యలను పరిష్కరించే దిశగా పోరాడేందుకు సంఘం సమాయత్తమవుతున్నట్లు వెల్లడించారు. రానున్న వరి సీజన్ వరకు రైతులు, రైస్ మిల్లర్లు, పౌరసరఫరాల అధికారులతో కలిపి సమావేశం ఏర్పాటు చేయాల్సిందిగా జిల్లా కలెక్టర్లకు లేఖలు అందించిన్నట్లు చెప్పారు. దీంతో వడ్ల అమ్మకాల్లో జరుగుతున్న మోసాలకు అడ్డుకట్ట పడే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో మండల సహ కార్యదర్శి పెంటయ్య, బాల్‌రాజ్, గ్రామ అధ్యక్ష, కార్యదర్శులు, రైతులు ఉన్నారు.

# మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట



సీసీరోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

**ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**

షాద్‌నగర్: ప్రజలకు కావాల్సిన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం పెద్దపీట వేసిందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 22వ వార్డులో మంగళవారం నూతనంగా నిర్మిస్తున్న సీసీరోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరిస్తున్నట్లు స్పష్టం చేశారు. ప్రజలకు కావాల్సిన కనీస మౌలిక సదుపాయాలను కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. పట్టణంలోని కాలనీల్లో సీసీరోడ్లు, అంతర్గత డ్రైనేజీలు, విద్యుత్ దీపాలు, మంచినీటి సదుపాయం వంటి కనీస సౌకర్యాలకు ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు మంజూరు చేస్తుందన్నారు. అభివృద్ధిలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు బాబర్‌ఖాన్, విశ్వం, సర్వర్‌పాషా, రాజేందర్ రెడ్డి, కొంకళ్ల చెన్నయ్య, బస్వం, తిరుపతిరెడ్డి, దంగు శ్రీనివాస్ యాదవ్, అర్జున్‌లక్ష్మణ్, యాదగిరియాదవ్, మసూద్‌ఖాన్, ముబారక్, రాములు, శ్రీనివాస్, నలమోని శ్రీధర్, మాధవులు తదితరులు పాల్గొన్నారు.

# బాధితులకు న్యాయం జరిగేలా చూడాలి



రికార్డులు తనిఖీ చేస్తున్న ఏసీపీ లక్ష్మినారాయణ

కొందుర్గు: వివిధ సమస్యలతో స్టేషన్‌ను ఆశ్రయించిన బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని షాద్‌నగర్ ఏసీపీ లక్ష్మినారాయణ సిబ్బందికి సూచించారు. మంగళవారం ఆయన కొందుర్గు పోలీసు స్టేషన్‌ను సందర్శించి పలు రకాల రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాధితులు ఫిర్యాదు ఇచ్చిన వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేయాలన్నారు. వారికి పూర్తి స్వేచ్ఛ కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో షాద్‌నగర్‌రూరల్ సీఐ నర్సయ్య, ఎస్ఐలు రవీందర్‌నాయక్, బాలస్వామి, ఏఎస్ఐ చత్రియనాయక్, హెడ్ కానిస్టేబుల్ శ్రీను పాల్గొన్నారు.

### ప్రీస్కూల్‌లో పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూ

కొందుర్గు: మండలంలోని విశ్వనాథ్‌పూర్‌లో ప్రీస్కూల్ టీచర్, ఆయా నియామకం కోసం మంగళవారం కొందుర్గు మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు ఇంటర్వ్యూ నిర్వహించారు. టీచర్ కోసం 11 మంది, ఆయా కోసం ముగ్గురు దరఖాస్తు చేసుకున్నారని ఎంఈఓ గాయత్రీదేవి తెలిపారు. కాగా టీచర్ సంబంధించి 9 మంది, ఆయా కోసం ముగ్గురు ఇంటర్వ్యూకు హాజరయ్యారని ఆమె పేర్కొన్నారు. కాగా ఆయా కోసం దరఖాస్తు చేసుకున్న అశ్విని తనకు ఈ ఉద్యోగం అవసరం లేదని ఒప్పంద పత్రం రాసి ఇచ్చినట్లు తెలిపారు.



# గ్రామ అభివృద్ధికి సహకరించండి

**టోల్‌ప్లాజా మేనేజర్‌కు తండావాసుల వినతి**

షాద్‌నగర్: గ్రామ అభివృద్ధికి సహకారం అందించాలని కోరుతూ మంగళవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని కడియాలకుంట తండావాసులు టోల్‌ప్లాజా మేనేజర్ ఇబ్రహీంను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీ కార్యాలయంలో కంప్యూటర్, ప్రింటర్ లేకపోవడంతో ప్రజలు, అధికారులు ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. అదేవిధంగా గ్రామంలో ముఖ్య కూడళ్లలో రాత్రి వేళల్లో చీకటిగా ఉంటుందని, హైమాస్ట్ లైట్లను ఏర్పాటు చేయాలన్నారు. ప్రధాన వీధుల్లో సీసీకెమెరాల ఏర్పాటుకు కృషి చేయాలని, గ్రామాభివృద్ధికి టోల్‌ప్లాజా నిర్వాహకులు తమవంతు సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బుజ్జి, రాజునాయక్, నాయకులు తావ్యాసింగ్, శంకర్, రెడ్యా, సేవ్య, రవి, రమేశ్ తదితరులు ఉన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న గిరిజనులు

### విద్యార్థికి అభినందన



విద్యార్థి రమేశ్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ డా.కాంచనలత, ప్రొఫెసర్ మాలిక్

చేవెళ్ల: ఉస్మానియా యూనివర్సిటీ నిర్వహించిన పీజీ ఎంట్రెన్స్ పరీక్షలో పట్టణ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థికి ఉత్తమ ర్యాంకు రావటం సంతోషకరమని ప్రిన్సిపాల్ డా.కాంచనలత అన్నారు. పరీక్షలో ఎకనామిక్స్ సబ్జెక్ట్‌లో రాష్ట్రస్థాయిలో 31వ ర్యాంక్ సాధించిన విద్యార్థి వి.రమేశ్‌ను మంగళవారం కళాశాలలో ప్రిన్సిపాల్, అధ్యాపకులు ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఎకనామిక్స్ అసోసియేట్ ప్రొఫెసర్ డా.ఎంఏ మాలిక్‌ను కూడా అభినందించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు ఉన్నారు.

# రైతులే దేశానికి వెన్నెముక

**భారతీయ కిసాన్ సంగ్ జిల్లా అధ్యక్షుడు సామ మాధవరెడ్డి**

మొయినాబాద్‌రూరల్: రైతులు 24 గంటలు కష్టపడి చెమటోడ్చి పని చేస్తున్నప్పటికీ వారికి దేశంలో గుర్తింపు ఇవ్వడం లేదని భారతీయ కిసాన్ సంగ్ జిల్లా అధ్యక్షుడు సామ మాధవరెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని సజ్జనపల్లిలో భారతీయ కిసాన్ సంఘ్ జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని పెద్దఎత్తున నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ అధ్యక్షుడు నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో జాతి గోవులను పోషిస్తున్న పాడిరైతు దంపతులను వారు సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారతీయ కిసాన్ సంఘ్ విధి విధానాలను రైతులకు తెలియజేశారు. అధిక వర్షపాతంతో నష్టపోతున్న రైతులను ఆదుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. పసల్‌భీమా అందించాలని, పంటలకు లాభసాటి ధరను చేకూర్చాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా భారతీయ కిసాన్ సంఘ్ సభ్యులు అనిమోని కృష్ణ, కనకమామిడి శంకర్, సుధాకర్‌రెడ్డి, మండల కార్యవర్గ సభ్యులు శ్రీనివాస్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, శివ, గోపాల్‌రావు, మోహన్‌రెడ్డి, అశోక్, రాంరెడ్డి, ఆంజనేయులు, కరుణాకర్‌యాదవ్, శ్రీనివాస్‌గౌడ్, నరేందర్, విఠలయ్య, గోపిగౌడ్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



పాడిరైతు దంపతులను సన్మానిస్తున్న భారతీయ కిసాన్ సంగ్ సభ్యులు

# బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడికి సన్మానం

మొయినాబాద్: భారతీయ యువ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన మండలంలోని రెడ్డిపల్లికి చెందిన గణేశ్‌ను చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం అభినందించారు. మంగళవారం రత్నంతో పాటు బీజేపీ నాయకులు గణేశ్ నివాసానికి వెళ్లి ఆయనను శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కిందిస్థాయి నుంచి కష్టడుతూ పార్టీ అనుబంధ సంఘాల బలోపేతానికి కృషి చేసిన గణేశ్‌కు యువ మోర్చా రాష్ట్ర అధ్యక్ష పదవి దక్కడం అభినందనీయమన్నారు. భవిష్యత్తులో మరిన్ని పదవులు అనుభవించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు సన్‌వెల్లి ప్రభాకర్‌రెడ్డి, కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి మోర నర్సింహారెడ్డి, బీసీ మోర్చా చేవెళ్ల నియోజకవర్గ కన్వీనర్ ఎల్గని వెంకటేశ్‌గౌడ్, బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు శ్రీకాంత్, మండల అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు. అదేవిధంగా బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన వీరేందర్‌గౌడ్‌ను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.



గణేశ్‌ను సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే రత్నం, నాయకులు

### పగిలిన భగీరథ పైపులైన్



వెంకిర్యాల వాగులో పగిలిపోయిన పైపులైన్

కొందుర్గు: మిషన్ భగీరథ పైపులైన్ పగిలిపోయి గత మూడు రోజులుగా మండలంలోని వెంకిర్యాల, లక్ష్మీదేవిపల్లి, ఆగిర్యాల, పాత ఆగిర్యాల గ్రామాలకు మిషన్ నీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో ఆయా గ్రామాల ప్రజలు తాగునీటి కోసం అనేక ఇబ్బందులు పడుతున్నారు. కాగా పైపులైన్ లీకేజీతో భగీరథ నీళ్లు వృథాగా వాగులో కలిసిపోతున్నాయి. అధికారులు ఇప్పటికైనా స్పందించి తగు చర్యలు తీసుకొని పైపులైన్ మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.

# కాళోజీ సేవలు మరువలేనివి

చేవెళ్ల: ప్రజాకవిగా తన కవిత్వాలతో సమాజాన్ని చైతన్యం చేసిన మహనీయుడు కాళోజీ నారాయణ రావు సేవలు మరువలేనివని మున్సిపల్ కమిషనర్ ఎస్.వెంకటేశం, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కాంచనలత, ఆదర్శ కళాశాల, పాఠశాల ప్రిన్సిపాల్ చిన్నపురెడ్డి అన్నారు. మంగళవారం కాళోజీ జయంతి సందర్భంగా చేవెళ్లలో ఆయన చిత్రపటాలకు మున్సిపల్ కార్యాలయంలో, ఆదర్శ కళాశాల, పాఠశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో వేరు వేరుగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కాళోజీ రచించిన కవితలు, గ్రంథాలు, తెలుగు బాషపై ఆయనకు ఉన్న పట్టును గుర్తు చేసుకున్నారు. ఆదర్శ పాఠశాలలో విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్ర,మంలో మున్సిపల్ అధికారులు, అధ్యాపకులు డాక్టర్ ఎం.రమేశ్‌బాబు, కవిత, ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయులు మల్లేశ్, శ్రీనివాస్‌గౌడ్, శివకుమార్, వినోద్, బాబు, అంజినప్ప, స్వప్న, వీణ, షాహిన్, నుర్జాహన్, విద్యార్థులు పాల్గొన్నారు.

**సమాజాన్ని జాగృతం చేసిన కవి కాళోజీ**

షాద్‌నగర్: సమాజాన్ని జాగృతం చేసిన కవి కాళోజీ నారాయణరావు అని మున్సిపల్ కమిషనర్ సునీత అన్నారు. కాళోజీ జయంతి సందర్భంగా మంగళవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి మున్సిపల్ కమిషనర్, సిబ్బంది పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



చేవెళ్ల: మున్సిపల్ కార్యాలయంలో చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధికారులు, సిబ్బంది

**ప్రజాకవి కాళోజీ**

షాద్‌నగర్‌రూరల్: ప్రజాకవి కాళోజీ నారాయణ రావు తన రచనలతో సమాజాన్ని జాగృతం చేశారని ప్రిన్సిపాల్ విద్యుల్లత అన్నారు. కాళోజీ జయంతి సందర్భంగా మంగళవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని కమ్మదనం బాలికల గురుకుల పాఠశాలలో ప్రిన్సిపాల్ ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాళోజీ చిత్రపటానికి పూలమాలలువేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థినులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా పట్టణంలోని భాగ్యనగర్‌కాలనీలో గల కృష్ణవేణి ఉన్నత పాఠశాలలో ప్రిన్సిపాల్ రఫత్‌సుల్తానా ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కవి కాళోజీ నారాయణరావు చిత్రపటానికి పూలమాలలువేసి ఘననివాళులర్పించారు. అనంతరం తెలుగు ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.

**మొగిలిగిద్దలో..**

మండల పరిధిలోని మొగిలిగిద్ద జెడ్పీహెచ్ఎస్‌లో ప్రధానోపాధ్యాయుడు శేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రజాకవి కాళోజీ నారాయణరావు చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన, పద్యాలు, పాటలు, పొడుపు కథల పోటీలతో పాటు కాళోజీ జీవితంపై క్విజ్‌ను నిర్వహించి గెలుపొందిన విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకట్‌రెడ్డి, వెంకటయ్య, చంద్రశేఖర్, వసంతలక్ష్మి, రేణుకాచౌదరి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



చేవెళ్ల: ఆదర్శ పాఠశాల, కళాశాలలో..



షాద్‌నగర్: కాళోజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మున్సిపల్ అధికారులు



షాద్‌నగర్‌రూరల్: కాళోజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న విద్యుల్లత, ఉపాధ్యాయులు